

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**క్లాసులో ప్రొఫెసర్ చెప్పింది** నాకు సగం అర్థంకాలేదు. నేను అర్థం చేసుకునేలోపే చాలామంది ప్రశ్నలు కూడా అడిగారు. మొదటి క్లాస్‌లోనే ప్రశ్నలు అడుగుతున్నారంటే వీళ్ళెంత తెలివైన వాళ్ళో! రెండు ఎక్జాములు, ఒక ప్రాజెక్ట్ చెయ్యాలట. ప్రాజెక్ట్‌కి నలభై శాతం మార్కులన్నారు. అది చాలా కష్టం అని నిఖిల చెప్పింది. క్లాసునుండి వెంటనే లైబ్రరీకి వెళ్ళి ప్రొఫెసర్ చెప్పిన టెక్స్ట్ బుక్స్ అద్దెకి తీసుకున్నాను. ఒకటే క్లాసైనా ఆ టెక్స్ట్ బుక్స్ మాత్రం మూడు. ఇంకా నాలుగో అయిదో జర్నల్స్ కూడా చదవాలని అన్నారు. మరో క్లాసులోగా కాస్త చదువుదాం అని నిశ్చయించుకున్నాను. కానీ ఎక్కడ మొదలు పెట్టాలో తెలీదు. ఇంతలో ఒక ఇండియన్ అబ్బాయి వచ్చి "నువ్వు నిఖిల ఫ్రెండా?" అడిగాడు.

"ఔను."

"క్లాసులో చూసాను"

"నువ్వు కూడా సేం క్లాసా?"

"యా. అవును. నెక్స్ట్ టైం నాకు కూడా ఒక లాలీపాప్ తీసుకురండి."

నవ్వాను.

"జోక్ కాదు నిజంగా. నాకు క్లాసులో ఎంత ఆకలేసిందో"

"సరే"

"అప్పుడే బుక్స్ తీసుకున్నావా?"

"చదువుదామని."

"ఫస్ట్ డే నించే? బిటెక్‌లో టాపరా?"

"కాదు, క్లాసులో ఏం చెప్పారో ఏమీ అర్థంకాలేదు."

"టోఫెల్‌లో స్కోర్ ఎంత?"

"ఇంగ్లీష్ వచ్చు. లెక్చర్ అర్థంకాలేదు. ప్రాజెక్ట్ ఎప్పుడు చెయ్యాలి? హోం వర్క్స్ ఎప్పుడు ఇస్తారట?"

"ఇక్కడ మన ఇండియాలో లా కాదు కదా. మొదట్లో అలానే ఉంటుంది. ఫరవాలేదులే. ప్రాజెక్ట్ మిడ్ టర్మ్ ఎక్జాం అయ్యాక. అది గ్రూప్ ప్రాజెక్ట్. నలుగురూ కలసి చెయ్యాలి. హోం వర్క్స్ ఈజీగానే ఇస్తారాయన."

"ఈ టెక్స్ట్ బుక్స్‌లో ఎక్కడ మొదలు పెట్టాలి?"

లాప్‌టాప్‌లో కోర్స్ రిసోర్సెస్ తెరిచి "ఈ రెండు ఇప్పుడు అక్కర్లేదు. ఇదొక్కటి చాలు" నా చేతిలోంచి బుక్స్ తీసుకుని చెప్పాడు.

"మరెప్పుడు కావాలి?"

"ఒకటి మిడ్ టరమ్స్ అయిపోయాక ఇంకోటి ప్రాజెక్ట్‌కి రెకమెండెడ్ అట."

"అయితే మిడ్ టర్మ్ వరకు ఈ ఒక్కటి చాలా?"

"బుక్ అంతా కాదు. ఇక్కడ రాసారు కదా, ఈ చాప్టర్స్ మాత్రమే"

"అంతేనా?" ఆశ్చర్యపోయాను.

"అంతేనా కాదు ఆ చాప్టర్లు చదవాలంటే బ్యాక్‌గ్రౌండ్‌లో చాలా నేర్చుకోవాలి."

"ఓ. సరే"

"నీకు ఆన్ కాంపస్ జాబ్ వచ్చిందా?"

"యా."

"నువ్వు ఇప్పుడే వచ్చావు కదా?"

"ఔను."

"అవని?"

"యా" పేరు తెలియకుండానే ఇంతసేపు మాట్లాడానని గుర్తొచ్చింది.

"నీ ఒక్కదానికే ఫస్ట్ సెమిస్టర్ ఆన్ కేంపస్ జాబ్ వచ్చింది. అందుకే ఫేమస్" నవ్వాడు.

"నీ పేరు?"

"లయన్."

"ఆ? లయనా?" విచిత్రంగా చూసాను.

"నెపోలియన్. అందరూ లయన్ అంటారు."

"నెపోలియనే బావుంది. ఎవరో పాతకాలంలో రాజు కదా?"

"ఛీఛీ నెపోలియన్ బోన పార్ట్. ఎంపరర్ ఫ్రాన్స్‌కి. ఫ్రెంచ్ రివల్యూషన్‌ని సపోర్ట్ చేసాడు. మా తాతయ్యకి చాలా ఇష్టమని నాకు ఆ పేరు పెట్టారు."

"మీ నాన్న పేరేంటి?"

"విశ్వామిత్ర. నాయనమ్మ పెట్టింది."

"ఆ ఎంపరర్ అన్నా, రాజు అన్న ఒకటే కదా?" అడిగాను.

"నెపోలియన్‌కి నోబుల్ లైన్ అంటే ఇష్టంలేదు. అందుకని రాజు అంటే నాకు నచ్చదు. పరిపాలకుడు అనొచ్చు."

"అబ్బో. బానే తెలుసుకున్నావు నీ పేరుకి మూలకారణం అయిన వ్యక్తి గురించి"

"చిన్నప్పుడు మా తాతయ్య నూరిపోసారు."

"బావుంది."

"పేరా? తాతయ్యా?"

"రెండూ"

"అవని అంటే భూమి కదా?"

"యా. అవును."

"నీ పేరు కూడా బావుంది. యునీక్."

"నువ్వు ఎన్నో సెమిస్టర్?"

"సెవెంత్ సెమిస్టర్."

"అదేంటి?"

"నేను పి.హెచ్.డి చేస్తున్నాను. ఇప్పుడు ఫోర్త్ ఇయర్‌లో ఉన్నాను. ఈ క్లాసు ఒక్కటే మిగిలింది."

"మరి మిగిలిన టైం?"

"థీసిస్. ప్లస్ టీచింగ్."

"ప్రొఫెసర్ అవుతావా?"

"లేదు. ఇండస్ట్రీ జాబే."

"మరి పిహెచ్‌డి ఎందుకు?"

"నాసాలో అందరికి మినిమం పిహెచ్‌డి  అని ఎక్కడో చదివాను .అందుకే పిహెచ్‌డి చేస్తున్నాను. లేకపోతే ఎప్పుడో చదువుకి దండం పెట్టేవాడిని."

"నాసాలో జాబ్ అంటే కష్టంకదా?"

"కష్టమే. పిహెచ్‌డి అయినా కష్టమే. అసలు వీసా రావాలన్నా కష్టమే."

"నువ్వు అమెరికెనా?"

"పేరు ఫ్రెంచ్, మాట్లాడుతుంది తెలుగు, చూడ్డానికి అమెరికన్‌లా ఉన్నానా?"

"లేదు నాసాలో ఇండియన్స్‌కి జాబ్ ఇవ్వరు కదా"

"కొన్ని జాబ్స్‌ని కాంట్రాక్ట్‌కి ఇస్తారు. గ్రీన్‌కార్డ్ వస్తే టెక్నికల్ సైడ్ డీప్‌గా వెళ్ళొచ్చు. సిటిజెన్ షిప్ వస్తే ఏదైనా చెయ్యొచ్చు."

"కాంపెటీషన్ ఉంటుందేమోగా?"

"యా. మామూలు కంపెనీలకన్నా రెండు రెట్లుండచ్చు."

"మరి రిస్కేమో?"

"అందుకే పిహెచ్‌డి. సేఫ్‌గాఉండడానికి దానిపైన ఇంటర్న్ షిప్స్, రిసర్చ్ పేపర్స్, రెకమెండేషన్ లెటర్స్, జిపిఏ, ప్రాజెక్ట్స్."

"ఓ ఎన్ని పేపర్లు రాసావు?"

"పబ్లిష్ అయినవి రెండు. థీసిస్ పూర్తి చేస్తే కాన్ఫరెన్స్ లో ప్రెజెంట్ చేస్తా"

"మరి వేరే జాబ్స్‌కి అప్లై చేయ్యవా?"

"చేస్తా. నేను కాన్ఫిడెంట్ కానీ ఓవర్ కాన్ఫిడెంట్ కాదు" చిన్నగా నవ్వాడు.

"నాకు ఈ క్లాస్‌లో హెల్ప్ చేస్తావా?

"భేషుగ్గా వేరే క్లాసెస్‌లో హెల్ప్ కావాలన్నా నన్ను అడుగు. ఏం మొహమాట పడకు."

"నీ నంబర్ ఇస్తావా?"

"యా, తీసుకో"

"నువ్వే ఫీడ్ చెయ్యి" ఫోన్ ఇచ్చాను.

"నేం నెపోలియన్ అని పెడుతున్నాను."

"యా, ఓకే"

"సరే మరి నేను వాలీ బాల్ ఆడ్డానికి వెళ్ళాలి. మళ్ళీ కలుద్దాం."

"సరే థ్యాంక్స్. బాయ్" ఇంటికి బయలుదేరాను.

ఇంటికి వెళ్ళగానే హనీషకి క్లాసు సంగతంతా చెప్పాను. నేను ఎక్స్‌క్యూజ్‌మి అన్న సంగతికి దాదాపు పదినిమిషాలు నవ్వింది. ఆ తరవాత నెపోలియన్‌తో జరిగిన సంభాషణ వివరించాను.

"తనంతట తనే నీతో మాట్లాడాడా?" ఆశ్చర్యపోయింది.

"ఔను. ఏ?"

"తను ఒక పెద్ద తోపు. డైరెక్ట్ పిహెచ్‌డికి వచ్చాడు. సమ్మర్‌లో రెండు ఆన్ కేంపస్ జాబులు చేసేవాడు. స్పోర్ట్స్ బాగా ఆడతాడు. మనకాంపెటీషన్స్‌లో బానే గెలుస్తాడు"

"నాకూ తన గురించి అంతే అనిపించిది. నాసాలో ఉద్యోగం చేస్తాడట"

"నేను షాక్ అవ్వను. తనకి ఎప్పుడూ జిపిఎ 4. ఒక్కసారి కూడా తగ్గలేదట. "

"ఓ నైస్."

"తను వచ్చి మాట్లాడాడంటే నీ 'ఎక్స్‌క్యూజ్‌మీ'కి బాగా జాలిపడి ఉంటాడు" మళ్ళీ నవ్వింది.

"ఏంకాదు. లైబ్రరీలో ఉండేసరికి స్టూడియస్ అనుకుని ఉంటాడు."

"వెన్నెల వచ్చాక మర్చిపోకుండా చెప్పాలి. ఇద్దరూ సేమ్ క్లాస్‌లో ఉండే వాళ్ళు. వెన్నెలకి పెద్ద క్రష్ ఆ అబ్బాయంటే. కానీ తను ఒక్కసారికూడా చూడలేదని చాలా బాధపడేది" ఇద్దరం నవ్వాం.

"ఇప్పుడే టెక్స్ట్ బుక్ తీసి చదువుతావా ఏంటి?" నా చేతితో బుక్ చూసి అడిగింది.

"లేదు" బుక్ కింద పెట్టాను.

"వంట చేద్దామా?"

"యా చేద్దాం" క్లాసు పూర్తవ్వగానే ఉన్న దిగులు, బెంగ నెపోలియన్ ఇంకా హనీషతో మాట్లాడక పోయింది. స్నేహితులు ఉండడం ఎంత ముఖ్యమో ఇప్పుడే తెలుసుకున్నాను. ఒక్కదాన్ని ఏడుస్తూ పడుకోకుండా హుందగా

ఉన్నానంటే నెపోలియన్ ఇచ్చిన ధైర్యం, హనీషతో సావాససమే కారణం. అన్నయ్య అమెరికాకి వచ్చినప్పటిలా కాక నాకు మంచివాళ్ళు పరిచయం అవ్వడం ఎంతో అదృష్టం.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story